# మార్పు

జంపు




లోపలికి వస్తున్న తండ్రిని చూసి చదువుతున్న 'ఇడియెట్' నవలని పక్కన పెట్టి తండ్రినే గమనిస్తోంది సునీత.

సుబ్బారావుకి కూతురి మొహంవైపు చూడాలన్పించలేదు. ఏదో 'గిల్టీనెస్' మనసుని పీకుతోంది. జోళ్ళు మూల విడిచి, మంచినీళ్ళు తాగాలనే వంకతో సరాసరి వంటింట్లోకి వెళ్ళాడు. వంటింటి గుమ్మంలో నిల్చుని, మంచినీళ్ళు తాగుతూ, పెరటివైపు రోజూ చూసే మావిడి చెట్టుని, దానిపై మునగదీసుకూర్చున్న బొంతకాకిని, సగం విరిగివున్న ప్రహారీ గోడని, ముప్వేసిన అరటిచెట్టుని చూస్తూ ఆలోచన్లోపడ్డాడు. ఉన్నది ఒక్కగానొక్క కూతురు. కొండంత ఆదరంతో, మరెంతో ప్రేమతో పెంచాడు. ప్రస్తుతం డిగ్రీ ఫైనల్‌లో వుంది. 'స్త్రీకి విద్య అవసరమా?' అనే ప్రశ్న వస్తే 'పెళ్ళయ్యేవరకు' అని సమాధానం చెప్పేవారిలో సుబ్బారావు మొదటివాడు. కూతురికి ఏవేం చెయ్యాలో తండ్రిగా యింతకాలం తన బాధ్యతలన్నీ సక్రమంగా నిర్వర్తించాడు. కాని పెళ్ళి దగ్గరికి వచ్చేసరికి యిన్నాళ్ళు 'కమా'లకి మాత్రం అలవాటు పడిన, ఆరువందల వుద్యోగస్తుడైన సుబ్బారావు యిప్పుడు 'ఫుల్‌స్టాప్' పడేసరికి తట్టుకోలేక పోతున్నాడు.

"ఏవిటి నాన్నా అంత ఆలోచన?" వంటింట్లోకి వస్తూ మృదువుగా అడిగింది సునీత.

"............"

"వాళ్ళు పాతిక్కి తగ్గరని నేను ముందే చెప్పాను కదా. అనవసరంగా ఆశలు పెంచుకున్నావు" అంది.

"పాతిక్కాదమ్మా....ముప్పై అడిగారు."

సునీత నవ్వుతూ, "రూపాయి విలువ పడిపోయింది కదా మరి. ఇదంతా 'యిన్‌ఫ్లేషన్' మహత్యం" అంది.

సుబ్బారావూ ఆలోచనల నించి తేరుకుని "కట్నం సాంఘిక దురాచారం అని ఎంతోమంది మొత్తుకుంటున్నారు. చట్టం చేశారు. దాన్ననుసరించకపోతే శిక్ష వేస్తామని బెదిరిస్తున్నారు. కాని ఈ కట్నం బాధ అంతకంతకీ మేరువులా పెరిగిపోతోంది" అన్నాడు.

"పెళ్ళి కొడుకులు మారాలి నాన్నా. తాము జీవితం పంచుకోవాల్సింది డబ్బుతో కాదు అమ్మాయితో అని వాళ్ళు గ్రహించేవరకు పరిస్థితి యిలాగే వుంటుంది."

"అబ్బాయిలనే అనుకోనక్కరలేదు. అబ్బాయి తల్లిదండ్రులు, వాళ్ళ గొంతెమ్మ కోర్కెలు మారాలి" అన్నాడు సుబ్బారావు తన అనుభవాల్ని నెమరువేసుకుంటూ.

యిద్దరూ వాళ్ళ వాళ్ళ మనసుల్లో అబ్బాయిలు, అబ్బాయిల తల్లిదండ్రులు మారాలి. అంతవరకూ ఈ వరకట్నం బాధ అందరూ అనుభవించాల్సిందే. మరో మార్గం లేదు అనుకున్నారు.

మధ్యగదిలో చాప మీద మధ్యాహ్నం భుక్తాయాసపు కునుకు తీస్తున్న సునీత తల్లి రత్నం, విసీ విన్పించని తండ్రీ కూతుళ్ళ సంభాషణ వింటూ, అటు వత్తిగిలి పడుకుంది.

❋

సూరావరాజు ఆటో మొబైల్ వర్క్ షాపు షెడ్డులో ఖాకీబట్టల్లో, చెమటలు కారుస్తూ, ట్రాక్టరు క్రింది భాగంలో బోల్టులు వూడదీస్తున్న సత్యాన్ని "ఏవండీ మీ కోసం ఎవరో అమ్మాయి వచ్చారండీ'' అన్నాడు పన్నెండేళ్ళ మెకానిక్ కుర్రాడు.

"ఎవరు?'' అన్నాడు ఆశ్చర్యంగా ట్రాక్టరు క్రింది నించి బయటకు వస్తూ.

"ఏమో తెలీదండి. మీ పేరు చెబితే షెడ్డులో వున్నారు పిలుస్తాను అని చెప్పానండి. ఆఫీసు గదిలో కూర్చోమని చెప్పి వచ్చానండి.''

సత్యం చేతుల్ని తువ్వాలుతో తుడుచుకుంటూ, ఆఫీసులోకి వచ్చి "మీరా?'' అని ఆశ్చర్యపోయాడు సునీతని చూస్తూనే. వారం రోజుల క్రితం పెళ్ళిచూపుల పేరుతో సునీతని చూశాడు యిప్పుడు యిలా....

సునీత చిరునవ్వుతో అతన్ని చూస్తూ "ఆశ్చర్యంగా వుంది కదూ'' అంది.

సత్యం తల వూపుతూ "ఏదన్నా పని వుంచి వచ్చారా?'' అన్నాడు.

"మీతో కొన్ని విషయాలు మాట్లాడాలి''

"యిక్కడ కష్టమర్స్ వస్తూ వుంటారు. హడావుడిగా వుంటుంది లోపల రెస్ట్ రూము అని ఒకటి వుంది. అక్కడ మాట్లాడుకుందాం రండి'' అన్నాడు లోపలికి దారి తీస్తూ.

సునీత అనుసరించింది.

"చెప్పండి'' అన్నాడు రెస్ట్‌రూములోకి వెళ్ళగానే, కిటికీ దగ్గరున్న స్టూలు మీద కూర్చుంటూ.

సునీత స్టూలుకి కొద్ది దూరంలో వున్న బెంచి మీద కూర్చుని "కట్నం తీసుకోవడం మీద మీ అభిప్రాయం ఏమిటి?'' అంది సూటిగా.

సత్యం కొద్దిసేపు ఆలోచనగా తల అటు యిటు ఆడించి "నాకు తెలుసు మీరీ ప్రశ్న ఎందుకు అడిగారో నేనీ మెకానిక్ షాపులో ఆరేళ్ళనించి పన్జేస్తున్నాను. ప్రస్తుతం నాకిక్కడ మూడువందల పాతిక యిస్తున్నారు. పి. యు. సి పూర్తవగానే, డిగ్రీలో చేరే స్తోమత లేక, ఎప్పటికయినా ఈ వర్కంతా నేర్చుకుని, ఆ అనుభవంతో నేనే స్వంతంగా మెకానిక్ షాపు పెట్టుకోవాలని యిందులో చేరాను. ఆ కోరిక తీరాలంటే నాకు డబ్బు కావాలి. ఈ రోజుల్లో ఎంత చిన్న మెకానిక్ షాపు పెట్టుకున్నా, ఎంత లేదన్నా పదిహేనువేలు పైన వుండాలి. అందుకనే పదిహేను వేలు కట్నం రూపంతో తీసుకోవాలనుకుంటున్నాను. నాకు అంతకన్నా మరో దోవలేదు. స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్'' అన్నాడు.

సునీత సమాధానంగా మరో మాట మాట్లాడలేకపోయింది. సత్యం మాటలు ఆమెకి సకారణంగానే వున్నట్లు అన్పించాయి. కట్నం తీసుకోవడం తప్పు. బ్రతుకుతెరువు చూసుకోవడం రైటు. రెండు విరుద్ధమైన విషయాలు కల్సిన విషయం యిది. యిది తప్పా? రైటా? ఆలోచనలో వుండిపోయింది.

ఆమె ఏమీ మాట్లాడకపోవడం చూసి సత్యం మళ్ళీ తనే అన్నాడు. "చూడండి-మీ నాన్నగారు ఎకౌంటెంట్‌గా ఆరువందలు సంపాదిస్తున్నారు. కాని ఏం లాభం........మొన్నటివరకు చెల్లెలు. తమ్ముడు, తల్లి బరువు బాధ్యతలు మోశారు. ఏవీ వెనకేయలేకపోయారు. యిప్పుడు........'' మరేదో అనదోయి గబుక్కున ఆగిపోయాడు. ఆ మాటంటే ఒకవేళ ఈ అమ్మాయి మనసు కష్టపెట్టుకుంటుందేమో అని.

"నిజానికి నాకు కట్నం మీద సదభిప్రాయం లేదు. కాని ఆశయం కూడుపెట్టదు కదా. కానీ కట్నం లేకుండా పెళ్ళి చేసుకుని ఎల్లకాలం యిలా మూడువందల పాతికతోనే పెళ్ళాం బిడ్డల్ని పోషించుకుంటూ వుండలేను. అందుకే ఇలా రాజీపడ్డాను'' అన్నాడు.

"నాన్న మీకు పదివేలకన్నా ఎక్కువివ్వలేరు. మరో పదివేలు ఖర్చుపెట్టి పెళ్ళి ఆడంబరంగా చెయ్యలేరు. 'మెకానిక్ షాపు పెట్టుకోవాలి' అదే కదా మీ కోరిక. నా వుద్దేశం, ఆలోచన చెబుతాను వినండి. నాన్న యిచ్చే పదివేలతో చిన్న షాపు పెట్టండి. దాన్ని చూపించి బాంకులో ఋణం తీసుకోవచ్చు. నేనెలాగూ గ్రాడ్యుయేట్‌ని కనుక నిరుద్యోగం సమస్య అధికంగా వున్నా ఏదో చిన్న వుద్యోగం దొరక్కపోదు. ఇద్దరం కలిసి బాంకు అప్పు తీర్చెయ్యొచ్చు. కాని పెళ్ళి మాత్రం పీటల మీద పెళ్ళి కాదు. రిజిష్టరు మారేజి. నా పెళ్ళి పేరు చెప్పి నాన్నని అప్పుల్లో ముంచడం నాకిష్టం లేదు. ఏవంటారు?'' అంది సునీత సాలోచనగా.

సత్యం మొహంలో మెల్లమెల్లగా సంతృప్తితో కూడిన చిరునవ్వు వెలిగింది.

అది చూసి సునీత 'యితను సహృదయుడు. ఎంతమందితో ఎన్నో మాట్లాడిన తర్వాత, ఎన్నో ఫెయిల్యూర్స్ అనంతరం, యిప్పుడు...యిన్నాళ్ళకి సక్సెస్' అనుకుంది.

❋

"అయితే సత్యం పెళ్ళికి ఒప్పుకున్నాడా? నువ్వు అదృష్టవంతురాలివమ్మా అయినా రిజిష్టరు మారేజి ఏవిటమ్మా. బొత్తిగా ఒక్కగానొక్క కూతురి పెళ్ళి ఆడంబరంగా చెయ్యకపోతే.... ఖర్చుకి భయపడ్డాడు సుబ్రావు అనరూ పదిమందీ.''

అలా చెప్పండి అన్నట్టు చూసింది రత్నం.

"ఉన్నమాట అనుకుంటే ఎందుకు నాన్నా మీకు బాధ. నిజం చెప్పండి మీరు ఖర్చుకి భయపడుతున్నారా లేదా? గొప్పకిపోయి పెళ్ళికి ఘరానాగా ఖర్చుచేసి, పీకలదాకా అప్పుల్లో మునిగితే పదిమందీ హర్షిస్తారా? మీరన్న ఈ పదిమందీ అప్పుడేవంటారో తెల్సా 'ఒళ్ళూ....పోయి....తెలీకుండా ఖర్చుపెట్టాడు....యిప్పుడు అనుభవిస్తున్నాడు' అంటారు. మీతో పెద్ద చిక్కు నాన్నా. మొన్నటివరకు పెళ్ళికి ఎంత డబ్బు ఖర్చు పెట్టాలో ఎంత అప్పు చెయ్యాలో....అని బెంగతో, బాధతో వాపోయేవారు. ఇప్పుడు పైసా ఖర్చు వుండదు అని తెలిసీ మరో రకమైన 'కాంప్లెక్సు'తో బాధపడుతున్నారు'' అంది సహనంతో కూడిన తీవ్రతతో.

సుబ్బారావు నవ్వుతూ "హ్యూమన్ మెంటాలిటీ అమ్మా అది. పోనీ నీ యిష్టప్రకారం కానియ్యి.'' అంటూ పేపరు చేతిలోకి తీసుకున్నాడు.

రత్నం నిట్టూర్చి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

సునీత నవ్వుకుంటూ 'ఇడియెట్'ని చేతిలోకి తీసుకుంది.

సుబ్బారావు లాల్చీజేబులోంచి హర్యానా లాటరీ టిక్కట్టు తీసి పేపర్లో వేసిన ఫలితాలను చూడసాగాడు.

❋

సుబ్బారావుకి లక్ష లాటరీలో తగిలిందని ఇంట్లో అందరికీ సంతోషంగావుంది. అప్పులిచ్చినవాళ్ళకి బంధువులకీ మరీ ఆనందంగా వుంది. పచారీ దుకాణంవాడు, బడ్డీకొట్టువాడు, పాలవాడు మొదలైన సమస్త జనం సుబ్బారావుని ఆదరంగా, అభిమానంగా చూస్తున్నారు.

"ఇప్పుడు మీకు లక్ష వచ్చిందని చెప్పుకోవడమేగాని చేతికి ఎనభై వేలే వచ్చాయి. అందులోంచి యిరవై వేలు తీసి, పొలంమీద, యింటిమీద వున్న అప్పులు, తాకట్టులు తీర్చెయ్యండి. పాతికవేలు సత్యానికి ఇస్తే తను యింక బాంకు లోన్ తీసుకోవల్సిన అవసరం వుండదు. మిగతా ఏభై ఐదువేలు బాంకులో వేసి, దానిమీద వచ్చే వడ్డీతో మీరు కాలు మీద కాలేసుకుని దర్జాగా బ్రతకొచ్చు" అంది సునీత.

సుబ్బారావు నవ్వాడు. "నిజమేనమ్మా మనకి సుఖపడే రాత భగవంతుడు ఎన్నాళ్ళకి రాసినట్టున్నాడు. యింతకీ అదృష్టం నాది" అన్నాడు.

రత్నం చెప్పాల్సిన విషయం యింకా వుంది. అదంతా యిప్పుడు చెప్పడమే మంచిది అన్నట్టుగా భర్తకి సైగ చేసింది.

"అమ్మా నువ్వు నాకు ఒక్కగానొక్క కూతురివి. నిన్ను ప్రేమగా చూసుకున్నా యిన్నాళ్ళూ నీ ఆనందమే నా ఆనందం నాదో మాట వుంది."

"చెప్పు నాన్నా."

"నువ్వు కాదనకూడదు."

"అదేమిటి నాన్నా నాకిష్టంలేని విషయాన్ని నేనెలా ఒప్పుకుంటాను?"

"నీ మంచికోసమేనమ్మా."

"నా మంచి నాకు తెలీదా నాన్నా."

"అదికాదమ్మా యింకా చిన్నపిల్లవి లోకజ్ఞానం తెలీనిదానివి."

"నిజమే నేను చిన్నపిల్లనీ లోకజ్ఞానంలేనిదానినే కాబట్టే మీరు మీ లోకజ్ఞానంతో కుదర్చలేకపోయిన పెళ్ళిని నేనే స్వయంగా కుదుర్చుకున్నాను."

"అదిగో నువ్వు నన్ను దెప్పుతున్నావు."

"వున్నమాటేకదా మీరు సత్యం తండ్రితో పదివేలిస్తాం అంటే ఒప్పుకున్నారావాళ్ళు మీరు సాధించలేనిది నేను సాధించానా? లేదా?"

"పోనీ ఆ సంగతి వదిలెయ్యి. ఈ విషయంలో నా మాట వింటానను చాలు."

కొద్దిసేపు నిశ్శబ్దం అనంతరం సునీత తల వూపింది. సత్యం సంబంధం మనకొద్దు నేను మరో సంబంధం ఖాయం చేసేశాను. అదో అలా కోపంగా చూడకు. నీ మంచికోసమే నా తాపత్రయం. అబ్బాయి పేరు శివశంకర్ బాంకులో మేనేజరు కట్నం యాభై వేలు ఈ పెళ్ళి జరిగితే నీ జీవితం ఎంత ఆనందంగావుంటుందో ఒక్కసారి ఆలోచించు. మనది మధ్యతరగతి జీవితం. ఎప్పుడూ ఏవో లోటులతో, బాధలతో, బెంగలతో బ్రతుకుతున్నవాళ్ళం. సత్యం మధ్యతరగతివాడే అతడ్ని చేస్కుంటే నీ జీవితం ఎప్పటికీ యిలాగేవుంటుంది. ఎదుగూబొదుగూ వుండదు. ఆనందం వుండదు. ప్రతీదానికి తడుముకోవాల్సివుంటుంది. అవసరమైన వస్తువులు కొనుక్కోవడాన్కి కూడా ముందూ వెనుకా చూసుకోవలసివుంటుంది. శివశంకర్‌ని చేసుకుంటే ఆ బాధ వుండదు. డబ్బుకి పేరు ప్రతిష్ఠలకి గౌరవాన్కి ఆనందానికి లోటుండదు. ఈ మధ్యతరగతి అసంతృప్తి జీవితం కాకుండా హైక్లాసు జీవితం జీవించొచ్చు నువ్వు. ఆలోచించుకో" అన్నాడు సుబ్బారావు కూతురి మొహంలోకి చూస్తూ.

❋

బాంకునించి యింటికి ఆటోరిక్షాలో వచ్చిన శంకర్‌ని చూసి, "స్కూటరు ఏవయింది? రిపేరుకిచ్చారా?" అంది సునీత.

"అప్పే లేదు అమ్మేశాను" అన్నాడు లోపలికి వచ్చి కుర్చీలో కూర్చుంటూ.

"ఎందుకు?" ఆశ్చర్యపోతూ అడిగింది.

"ఆఁ...ఆ పాత మోడల్ స్కూటరు ఎవరిక్కావాలి. కొత్త మోడల్స్ రెండు, మూడు వచ్చాయి మార్కెట్టులోకి మంచిది ఒకటి చూసి కొందాం అనుకుంటున్నా అయినా మావగారు వుండగా నాకేమి దిగులు."

"మా నాన్న మీకు స్కూటరు కొనిచ్చే పరిస్థితిలో లేరు. అలాంటి ఆశలు పెట్టుకోకండి."

"నువ్వు మాట్లాడకు మధ్యన. నా మావగారు ఆయన. కొనిచ్చే బాధ్యత ఆయనికి, అనుభవించే హక్కు నాకు వున్నాయి. బాంకు మేనేజరు అల్లుడు కావాలనుకుంటే సరా."

❋

ఏభై వేలు కట్నం యివ్వగా, యిరవై వేలు అప్పు తీర్చగా, మరో యిరవై వేలు పెళ్ళి ఖర్చులకి పోగా, లక్షకి అధికారనుకున్న సుబ్బారావు మళ్ళీ ఆరొందల ఎకౌంటెంట్ సుబ్బారావు అయ్యాడు. ఈలోగా అల్లుడి కోరికలమీద కోరికలు దాంతో పైన పాతికవేల అప్పుల్లో మునిగాడు యిల్లు, పొలం అమ్మేసినా.

పెళ్ళయిన మూడేళ్ళకే మొగుడితో విసిగి ఒంటరిగా పుట్టింటికి వచ్చిన కూతుర్ని చూసి బాధపడ్డాడు సుబ్బారావు.

రెండు రోజుల తర్వాత—

సునీత గూట్లో దుమ్ము పట్టేసివున్న ఇడియెట్ నవలని చూస్తూ "ఎందుకు నాన్నా - యిప్పుడు బాధపడి ఏం ప్రయోజనం? బాంకు మేనేజర్ని చేస్కుంటే డబ్బుకి లోటుండదు... పేరు ప్రతిష్ఠలకి లోటుండదు....గౌరవానికి లోటుండదు. ఆనందాన్కి లోటుండదు....అన్నావు – యిప్పుడు అన్నిటికీ లోటు వచ్చిందనా? మధ్యతరగతి అసంతృప్తి జీవితం కాకుండా హైక్లాసు జీవితం జీవించొచ్చు అన్నావు–యిప్పుడు బ్రతుకంటేనే విరక్తి పుట్టిందనా?"

సుబ్బారావు "అంత మాటనకమ్మా" అంటూ కూతురు చేతులు పట్టుకుని, "కూతుళ్ళ సుఖం కోసం తాపత్రయపడే తండ్రుల్లో నేడూ ఒకర్నమ్మా" అన్నాడు.

"కాని ఆ తాపత్రయం మిమ్మల్ని తప్పు దారిలో ప్రయాణం చేసేలా చేసింది. యిందులో మీదే కాదు తప్పు నాదీ వుంది. సత్యం సహృదయుడు, మంచివాడు అని తెలిసి కూడా. మనిషి మంచితనానికి ప్రాముఖ్యం యివ్వకుండా, శంకర్ వుద్యోగాన్ని, హోదాని చూసి ఆశపడ్డాను. జీవితం ఆనందంగా గడపాలనుకోవడం తప్పు కాదు. కాని జీవించడంలో కొన్ని మూల సూత్రాలు పాటించడం అవసరం. వాటిని పట్టించుకోకుండా అత్యాశపడటం తప్పు. దానివల్లే యింత జరిగింది. మనం అవకాశవాదులం నాన్నా. ఆరోజు–మనకి డబ్బు లేనప్పుడు కట్నం తప్పని, డబ్బు వుండగానే ఆ కట్నం ఎర చూపి మంచి ఉద్యోగస్తుడ్ని కొనుక్కోవాలని అత్యాశపడటం ఎంత హిపోక్రసీ! ఆ రోజు— మనిద్దరం అబ్బాయిలు, అబ్బాయిల తల్లిదండ్రులు మారినపుడే వరకట్న దురాచారం పోతుంది అనుకున్నాం. కాని మారాల్సింది....మార్పు రావాల్సింది అబ్బాయి, అబ్బాయి తలిదండ్రుల్లోనే కాదు. మనుషులందరిలోనూ మార్పు రావాలి. యిదే కాదు-మరే దురాచారమైనా సంఘం నించి దూరమవ్వాలంటే, ఏ కొంతమందో మారితే సరికాదు, అందరిలోను మార్పు రావాలి. ఒక సూత్రానికి, ఒక పద్ధతికి, ఒక ఆశయానికి కట్టుబడి జీవించినప్పుడే మనిషి జీవితం–సమాజ పరిస్థితి మెరుగవుతాయి. కాని.... ఈ నీతి ఆలస్యంగా నేర్చుకున్నాం నాన్నా" అంది సునీత నిట్టూరుస్తూ. □